# 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాల కూల్చివేత అవసరమా?

- రూ.18 కోట్లు తెచ్చింది నేను.. కంప్లైంట్ లు చేస్తూ పనులు ఆపించేది లోకల్ ఎమ్మెల్యే
- నేను బిల్డింగ్ లు కూల్చకుండా బైపాస్ రోడ్ వేద్దామంటే లోకల్ ఎమ్మెల్యే అన్ని బిల్డింగ్ లు కూల్చాలంటున్నాడు
- కూల్చివేతలు లేకుండా బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తాం
- మున్సిపల్ అధికారులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి బై పాస్ రోడ్లో కాలినడకన పర్యటించిన జగ్గారెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బుధవారం సాయంత్రం పర్యటించారు. బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కాలినడకన రోడ్డును పరిశీలించారు. బైపాస్ రోడ్డుపై ప్రస్తుతం ఉన్న రహదారి విస్తీర్ణాన్ని మూలమూలన అధికారులతో కొలతలు తీయించారు. రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి నష్టం కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు."ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే 80 అడుగుల రోడ్డు కోసం నిర్మాణాలను కూల్చివేయాలని చెబుతున్నారు. 80 అడుగుల రోడ్డు వేయాలంటే సుమారు 180 భవనాలు తొలగించాల్సి వస్తుంది. వారికి కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆచరణలో సాధ్యమవుతుందా?" అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.ఎలాంటి కూల్చివేతలు లేకుండా 50 అడుగుల రోడ్డును అభివృద్ధి చేయవచ్చని, దీనివల్ల ప్రజల ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాల కంటే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం అధికారులు పనిచేయాలని సూచించారు."నేను రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి రోడ్డు పనులు చేస్తుంటే , స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఇంట్లో కూర్చొని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు చేస్తున్నారు. దీని వల్ల పనిచేయాల్సిన అధికారులు ఇబ్బందులు పడుతున్నారు" అని ఆయన అన్నారు.బైపాస్ రోడ్డు అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యేకు నిజంగా 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే, ప్రజల మధ్యకు రావాలని, బైపాస్ రోడ్ లో ప్రజల వద్దకు వచ్చి కూల్చివేతలపై స్పష్టంగా మాట్లాడాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడం కాకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారి విస్తరణ చేపట్టడం తన ఉద్దేశ్యం అన్నారు.




## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**విశ్వంభర, హిమాయత్‌నగర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేలాది మంది ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి ఈ. అశ్వత్థామరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏ.పీ. మిథున్‌రెడ్డి, ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్, ఐఎన్‌టీయూసీ సంయుక్త కార్యదర్శి ఇందిరారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు హాజరయ్యారు. తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌లో విలీనమైందని, వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డిని ఈ సమ్మేళనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల పై తనకు మొదటి నుంచే అవగాహన ఉందన్నారు. 2019లో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో అశ్వత్థామరెడ్డితో కలిసి తాను అనేక డిపోలను సందర్శించి కార్మికులకు అండగా నిలిచానని మంత్రి తెలిపారు. పలు డిపోలకు వెళ్లి కార్మికులను కలసి వారి సమస్యలను తెలుసుకున్నామని చెప్పారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనూ సమ్మెలో ఉన్న కార్మికులను కలిసి వారికి మద్దతు తెలిపినట్లు గుర్తుచేశారు. కార్మికులకు న్యాయం జరిగితే ఉత్పాదకత పెరుగుతుందని, సంస్థలు కూడా మెరుగ్గా పనిచేస్తాయని మంత్రి అన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థల అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. 4,584 కొత్త ఉద్యోగాల భర్తీ జరిగిందని చెప్పారు. కారుణ్య నియామకాల ద్వారా కూడా 2 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలు కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ప్రయోజనం అందుతోందని తెలిపారు. కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, తాను కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని తెలిపారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలిలో మొగుళ్ల రాజిరెడ్డి అన్ని విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఫలితంగా జలమండలి ఉద్యోగులు మొగుళ్ల రాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. త్వరలో జరిగే ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో నూతన అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అభ్యర్థి ఈ. అశ్వత్థామరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (ఏ4522) విజయానికి ప్రతి ఒక్క ఆర్టీసీ కార్మికుడు కృషి చేయాలని కోరారు.

## క్రమశిక్షణా కమిటీ ముందుకు నర్సారెడ్డి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ డీసీసీ చీఫ్ నర్సారెడ్డి తనకు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నోటీసులకు వివరణ ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం గాంధీభవన్ లో కమిటీ చైర్మన్, మల్లు రవి, కమిటీ వైస్ చైర్మన్ అనంతుల శ్యాంమోహన్ లను కలిసి తన వివరణ లేఖను అందజేశారు. ఇటీవల నర్సారెడ్డిపైన సిద్దిపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనితో కమిటీ ఆయనకు నోటీసులు పంపగా తన వివరణ ఇచ్చారు. తనపైన వచ్చిన ఫిర్యాదులపైన కమిటీ ముందు తన వాదనలు వినిపించారు. పార్టీ బలోపేతంపైన దృష్టి పెట్టాలని, స్థానికంగా ఉండే అంతర్గత విభేదాలను పక్కన పెట్టాలని ఆయనకు కమిటీ సూచించినట్లు సమాచారం. నర్సారెడ్డి కూడా కొందరు నేతలు ఫిర్యాదు చేసినందున వారిని కూడా కమిటీ ముందుకు పిలుస్తామని కమిటీ వర్గాలు తెలిపాయి.



## వృద్ధ మహిళ హత్య కేసులో భార్యాభర్తల అరెస్ట్




**విశ్వంభర, జనగామ :** జనగామ జిల్లా: దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో వృద్ధ మహిళ అనుమానాస్పద మృతి ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు ఉపేంద్ర (వయస్సు వివరాలు దర్యాప్తులో నిర్ధారించవలసి ఉంది). ఆమె తన కుమారుడు పెందొట వెంకటేశ్వర్లు, S/o సోమనర్సయ్య, వయస్సు 54 సంవత్సరాలు, వృత్తి: గోల్డ్ వర్క్, ప్రస్తుతం కడవెండి గ్రామంలో నివసిస్తున్న ఇంటికి సుమారు నాలుగు నెలల క్రితం వచ్చినట్లు సమాచారం.కుటుంబంలో తరచుగా జరుగుతున్న గొడవలు, మృతురాలి పట్ల ఉన్న విభేదాల నేపథ్యంలో 08.09.2026 రాత్రి వెంకటేశ్వర్లు మరియు అతని భార్య పెందొట వనిత, భర్త వెంకటేశ్వర్లు, వయస్సు 31 సంవత్సరాలు మృతురాలిపై దాడి చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె మృతి చెందినట్లు నిందితులు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం.మృతురాలి మరణాన్ని అనారోగ్యం కారణంగా జరిగినట్లుగా చూపించి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. అయితే మృతురాలి శరీరంపై గాయాల గుర్తులు కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించారు.తదుపరి, పోస్టుమార్టం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతో నిందితులు కడవెండి గ్రామ సర్పంచ్ భాషిపాక రాములును సంప్రదించి జరిగిన విషయాన్ని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. సర్పంచ్ ఇద్దరు నిందితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించగా, నిందితులు పోలీసుల ఎదుట తమకు తెలిసిన విషయాలను వెల్లడించారు. తర్వాత పాలకుర్తి సిఐ భరత్ సుమన్ వారిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం జనగామ కోర్టు యందు హాజరు పరిచారు ఈ విచారణ లో దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రాజేందర్,యాకుబ్, ప్రవీణ్ , సమత,పాల్గొన్నారు, డిసిపి రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

## పేద రైతుల పట్టా భూములకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ భూములు తీసుకోవాలి



**విశ్వంభర, పరిగి:** మండల పరిధిలోని కాళ్లపూర్ గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం చేపడుతున్న భూసేకరణ అంశాన్ని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణలో భాగంగా కాళ్లపూర్ గ్రామంలో ఉన్న పేద రైతుల సుమారు 160 ఎకరాల పట్టా భూములను భూసేకరణ నుంచి మినహాయించాలని కోరారు. పేద రైతులకు చెందిన పట్టా భూములకు నష్టం కలగకుండా, కేవలం అసైన్‌మెంట్ భూములను మాత్రమే భూసేకరణ కు వినియోగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.పట్టా భూములకు ప్రత్యామ్నాయంగా ఇతర గ్రామాల్లో అందుబాటులో ఉన్న అసైన్‌మెంట్ భూములను కేటాయించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే సంబంధిత అధికారులతో పాటు గ్రామ సర్పంచ్, గ్రామస్తులతో కలిసి చర్చించినట్లు అసెంబ్లీలో వెల్లడించారు.కాళపూర్ రైతుల ప్రయోజనాలను కాపాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూమిని ప్రత్యామ్నాయ మార్గంలో సమకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పరిగికి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కాంప్లెక్స్, ఆర్డీఓ కార్యాలయం, పరిగి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కాంప్లెక్స్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో తెలిపారు.పేద రైతుల భూములకు రక్షణ కల్పిస్తూ పరిగి ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను సాధించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

## మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, సూర్యాపేట :** ఈ నెల 19వ తేదీన కోదాడ పట్టణంలోని సిసి రెడ్డి కాన్వెంట్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో, గౌరవ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, అవకాశాలను విజయాలుగా మార్చుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా సూచించారు. ఈ సందర్భంగా బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెగా ఉద్యోగ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ మేళాకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఎస్పీ నరసింహా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. మెగా ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన 300 వరకు ప్రముఖ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నందున, విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే స్కానర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, తగిన ఉద్యోగాన్ని సాధించేందుకు ఈ మెగా ఉద్యోగ మేళాను ఒక మంచి అవకాశంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాలరాజు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కుసుమ్ సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం : కాసిడి గౌతమ్ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూర్ :** ఆత్మకూర్ సెక్షన్ పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 1 మెగావాట్ సామర్థ్యం గల పీఎం కుసుమ్ సౌర విద్యుత్ ప్లాంట్‌ను చీఫ్ ఇంజనీర్ కాసిడి గౌతమ్ రెడ్డి, హన్మకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్ సౌమ్యా నాయక్, పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ కాసిడి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు రైతులకు పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంపొందించడం ద్వారా విద్యుత్ రంగంలో స్థిరమైన అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డీఈ మల్లికార్జున్, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, ఆత్మకూర్ తహసీల్దార్ (ఎమ్మార్వో), ఏఈలు, సౌర విద్యుత్ ప్లాంట్ యజమాని తాటిపర్తి జితేందర్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.




## గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**విశ్వంభర, సూర్యాపేట :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి శాంతియుతంగా,బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ కమిటీలతో శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్పీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శాంతి సంఘం సమావేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఉత్సవ కమిటీలతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఉత్సవ కమిటీ సభ్యుడు బాధ్యతగా వ్యవహరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని, మండపాల వద్ద పోలీసుల పెట్రోలింగ్, గస్తీ కొనసాగుతుందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తూ భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనం చేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించుకోవడంతో పాటు, నిమజ్జనానికి వెళ్లే మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పరస్పరం సహకరించుకుంటూ కుల, మత భేదాలకు అతీతంగా కలిసిమెలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ ప్రశాంత్ కుమార్ కోరారు. ఉత్సవాల సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి డయల్ 112కు సమాచారం సూచించారు.ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిఐ లు రాజశేఖర్, ఉపేందర్ రావు, సూర్యాపేట మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వివిధ గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాతకక్షల నేపథ్యంలో యువకుడి హత్య




**విశ్వంభర, సికింద్రాబాద్:** పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసి హత్య చేసిన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూకారాంగేట్ సాయినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బురుగు కార్తీక్ (26) గతంలో ఓ ప్రేమ వివాహానికి సహకరించడంతో అతడిపై కొందరు కక్ష పెంచుకున్నట్లు తెలిపారు. 2023 నవంబర్ 4న రాజమండ్రి కార్తీక్, భానుశ్రీల ప్రేమ వివాహానికి బురుగు కార్తీక్ సహకరించాడు. దీంతో భానుశ్రీ తండ్రి జి. నాగేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు కార్తీక్‌పై ఆగ్రహం పెంచుకున్నారని పోలీసులు తెలిపారు. గతంలోనూ కార్తీక్‌తో గొడవలు జరిగాయని, అతడిని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న సాయంత్రం 6.30 గంటల సమయంలో సాయినగర్‌లోని నాగేశ్ ఇంటి ముందు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్దకు కార్తీక్ వెళ్లగా అక్కడ వివాదం తలెత్తింది. అనంతరం రాత్రి 8.50 గంటలకు కార్తీక్ తన స్నేహితులతో కలిసి మరోసారి అక్కడికి చేరుకున్నాడు. దీంతో నిందితులు ఇంటి నుంచి బయటకు వచ్చి అతడిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో గడ్డి ప్రవీణ్ కుమార్ ఇంట్లో నుంచి కత్తిని తీసుకువచ్చి గడ్డి మదన్ కుమార్‌కు ఇవ్వగా, అతడు కార్తీక్ మెడపై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో వ్యక్తి వెదురు కర్రతో దాడి చేయగా, మిగిలిన వారు కూడా కార్తీక్‌పై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య బురుగు అనూష (24) ఫిర్యాదు మేరకు లాలాగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. ఏ1 గడ్డి మదన్ కుమార్ (47), ఏ2 గడ్డి ప్రవీణ్ కుమార్ (43), ఏ3 గడ్డి సాయి కుమార్ (41), ఏ4 గడ్డి నాగేశ్ అలియాస్ నాగేశ్వరరావు (52), ఏ5 గడ్డి నర్సింగ్ రావు (76)లను ఈ నెల 15న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కత్తి, వెదురు కర్ర, దుస్తులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన అదనపు డీసీపీ జె. నర్సయ్య, ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, లాలాగూడ సీఐ బి. రవికిరణ్, ఎస్ఐలు యుగంధర్, విజయ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

## సమాజానికి ఆదర్శంగా నర్సీపట్నం డీఎస్పీ

### శరీర, అవయవాల దానంకు అంగీకారం



**విశ్వంభర, నర్సీపట్నం :** నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు తీసుకున్న మహోన్నత నిర్ణయం సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తోంది. మానవాళికి ఉపయోగపడేలా తదనంతరం తన శరీరాన్ని, అవయవాలను దానం చేసేందుకు ఆయన అంగీకార పత్రం అందజేశారు. ఒకవేళ బ్రెయిన్ డెత్ సంభవిస్తే తన అవయవాలను, ఒకవేళ సహజ మరణం పొందితే పార్థివదేహాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైద్య కళాశాలకు అప్పగించేలా ఆయన తన సమ్మతిని తెలిపారు. మరణం తర్వాత కూడా మరొకరికి జీవితాన్ని ప్రసాదించవచ్చనే గొప్ప సంకల్పంతో ఆయన ఈ ముందడుగు వేశారు. అధికారిక బాధ్యతల్లో బిజీగా ఉంటూనే, సామాజిక శ్రేయస్సు కోసం డీఎస్పీ శ్రీనివాసరావు చూపిన ఈ స్ఫూర్తి మరికొందరిలో చైతన్యాన్ని నింపింది. ఆయన మార్గదర్శకత్వంలో ప్రభావితమైన మరో ఎనిమిది మంది కూడా అవయవ దానానికి ముందుకు వచ్చి దరఖాస్తులు అందజేయడం విశేషం. మనం చేసే అవయవదానం ద్వారా తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడొచ్చని, అలాగే శరీరదానంతో వైద్య విద్యార్థుల పరిశోధనలకు, బోధనకు ఎంతో తోడ్పాటు అందించవచ్చని డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు.

## ఇందిరమ్మ చీరలు దగ్ధం..



**విశ్వంభర, ఎల్కతుర్తి :** ఇందిరా గాంధీ స్వశక్తి భవనములో బుధవారం ఇందిరమ్మచీరలు దగ్ధమయ్యాయి. ఐకేపీ ఎపీఎం కవితను దిశ వివరణ కోరగా, ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయగా, మిగిలిన 829 చీరలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వాటిని వాపస్ పంపిద్దామనేలోగా కాలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు కాలిపోయాయా, ఆకతాయిల పని అయ్యుంటుందా అని ఎస్సై నరసింహారావుకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐకే శ్రీను, ఎస్సై నరసింహారావు, పరిశీలించి విచారణ చేపడుతున్నామని తెలిపారు.